



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమి

మొదటిరోజు 'పది' పరీక్షలు ప్రశాంతం

2495 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లా వ్యాప్తంగా 142 సెంటర్లలో నిర్వహించిన సోమవారం నిర్వహించిన 10 వతరగతి తెలుగు పరీక్షకు 2495 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తెలిపారు.రెగ్యులర్, ప్రయివేటు కలిపి 34,074 మందికి గాను మొదటి రోజు తెలుగు పరీక్షకు 31, 579 మంది విద్యార్థులు హాజరు అయినట్లు తెలిపారు. నగరంలోని మొదటి రోడ్డు లోని శారదా మున్సిపల్ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గౌతమి పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు గురించి ఆరా తీశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ10వ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురులు



'పెన్నా'ను తోడేస్తున్న స్వార్థపరులు

అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా

పగలు పట్టణానికి... రాత్రి కర్నాటకకు తరలింపు

పట్టించుకోని అధికారులు

హిందూపురం ప్రాంతంలో అధికారుల అండదండలతో ఇసుక అక్రమ వ్యాపారం మూడు పూవులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. అభివృద్ధి పనుల కోసం ఇసుక దొరకడం కష్టంగా మారడంతో ఎక్కడిక్కడ పనులు నిలచి పోయాయి. అదే అక్రమ రవాణాకు మాత్రం ఇసుక ఎంత కావాల్సినా హిందూపురం ప్రాంతంలో దొరుకుతోంది. ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో పెన్నా నది వద్దే బిల్లులు ఇస్తు ఇసుక దోపిడీ చేస్తున్న ఎవరు పట్టించు కోవడం లేదు. మూడు రోజుల క్రితం పురపాలక సంఘ ఆధీనంలో మొత్కుపల్లి వద్ద ఉన్నా కంపోస్టు యార్డు భూమిలో ఇసుక లభిస్తుండడంతో దానిని శుభ్రం చేసి, అందులో దొరికే ఇసుకతో అభివృద్ధి పనులను చేసుకోవడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే వెంటనే సెబ్ అధికారులు అక్కడి వెళ్లి అనుమతులు లేకుండా ఎలా తరలిస్తారంటు అడ్డుకున్నారు.



పెన్నానదిలో ఇసుకను ట్రిపర్‌లోకి వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములతో పాటు నది పరివాహక ప్రాంతాలలో గత కొన్ని నెలలుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఇసుక తరలుతోంది. వీరు తమ సంస్థకు ఇసుక తీసుకెళ్లడానికి ప్రభుత్వం జీవో ఇచ్చిందని కాగితాలను చూపిస్తు ఇసుకను తోడేస్తున్నారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు సంబంధిత శాఖ అధికారులు అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ అనుమతులను ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు అనుమతి ఇచ్చిన చోట కాకుండా వేరే చోట తవ్వకాలు జరుపుతూ రూ.లక్షల విలువ చేసే ఇసుకను గుట్టుగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. అనుమతి ఒకచోట, తవ్వకాలు మరోచోట చేస్తున్నారని తెలుస్తోంది. బిల్లులు లేకుండా ఇసుక అక్రమంగా కర్నాటకకు తరలిస్తు లక్షలు దండుకుంటున్నారని విమర్శలు వినపడుతున్నాయి. ఇసుక అవసరం ఉన్న వారు ట్రాక్టర్ తీసుకెళ్లి ఇసుక కావాలంటే ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారికి రూ.2500 కప్పం కడితే వారు బిల్లు ఇస్తారు. అది తీసుకుని కూలీలను వారే ఏర్పాటు చేసికుని ఇసుకను తీసుకు వెళ్లాల్సుంది. దీంతో కొంత మంది అక్కడ రూ.2500 కొని, రూ.4వేల నుంచి రూ.4,500 వరకు అమ్ముకుంటున్నారు. పెన్నా నదిలో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు జరపడంతో పరివాహక గ్రామాల్లో భూ గర్భజలాలు అడుగంటుతున్నాయని తవ్వకాలు నిలిపివేయాలని పరిసర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రీచ్ లేకుండానే అనుమతులు మంజూరు

ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలంటే ఇసుక రీచ్‌ను గుర్తించి, భూగర్భ గనుల శాఖ అధికారులు వచ్చి ఇన్ని క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలు జరపాలని సూచించాలి. అయితే హిందూపురం ప్రాంతంలో ఇసుక రీచ్ ఒక్కటి కూడా లేదు. ఇసుక దొరకడం కష్టంగా ఉందని, గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం అయినా ఒక రీచ్ ఇవ్వాలని గతంలో వైసిపి నాయకులు మహమ్మద్ ఇక్బాల్ కలెక్టర్ తో పాటు రాష్ట్ర స్థాయిలో భూగర్భ గనుల శాఖ అధికారులను కోరారు. అయినప్పటికీ రీచ్‌కు అనుమతించలేదు. అయితే ప్రస్తుతం రీచ్‌కు ఎలా అనుమతులు ఇచ్చారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఎక్కడ రీచ్ ను గుర్తించారు, ఎప్పుడు గుర్తించారు అన్నది సందేహంగా మారింది.

అభివృద్ధి పనులకు దొరకని ఇసుక

హిందూపురం పురపాలక సంఘంతో పాటు రూరల్ మండలాల్లో ఇసుక దొరకక ఎన్నో అభివృద్ధి పనులు నిలచి పోయాయి. ఇసుక రీచ్ ఇక్కడ లేక పోవడంతో నాడు-నేడు, ఆరోగ్య ఉపకేంద్రాలతో పాటు ఆర్‌బికే, నూతన సచివాయాల నిర్మాణాలతో పాటు సిసి రోడ్లు, మురుగు కాలువలతో పాటు చివరకు పక్కాగృహాలకు కూడా ఇసుక లభించలేదు. ఇసుక లభించక ఇప్పటికీ ఒక్క హిందూపురం పురపాలక సంఘంలోనే కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు ఆగిపోయాయి.

నో చెక్‌పోస్టు.. నో చెకింగ్

హిందూపురం కర్నాటక సరిహద్దులో ఉంది. ఇక్కడ గతంలో చెక్ పోస్టును ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేవారు. ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తే ఇసుక తవ్వకాల వద్ద సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కానీ నిఘా ఉండాలి. ఇసుక రీచ్‌ల వద్ద వేమిషన్, సీసీ కెమెరాలు, ఇసుకను తరలించే లారీలకు, టిప్పర్‌లకు జీపీఎస్ ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ సంబంధిత అధికారులు వీటిలో వేటినీ ఏర్పాటు చేయలేదని తెలుస్తోంది. అదేవిధంగా ఇసుక రీచ్‌ల నుంచి లోడ్‌తో వెళితే టిప్పర్‌లను, లారీలను నిత్యం తనిఖీ చేసేందుకు స్థానికంగా చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడ చెక్‌పోస్ట్ లేకపోవడంతో ఎలాంటి వే బిల్లులు లేకుండా భారీ టిప్పర్లు, లారీల్లో ఇసుకను యథేచ్ఛగా సరిహద్దులను దాటించేస్తున్నారు. జిల్లా ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచాల్సి ఉండగా స్థానికంగా కాకుండా కర్నాటక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతిరోజూ రూ.లక్షల విలువ చేసే ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ప్రభుత్వా నికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. ఇదంతా సంబంధిత శాఖ అధికారులతో పాటు స్థానిక రెవిన్యూ, మైనింగ్, పోలీసులకు తెలిసినప్పటికీ ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.



ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఇచ్చిన బిల్లును చూపిస్తున్న ఇసుక ట్రాక్టర్ డ్రైవర్



ఇవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, తదితరులు

ఇవిఎంల గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్‌లో ఉన్న ఈవీఎంలను భద్రపరచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ గౌతమి సోమవారం పరిశీలించారు. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి వచ్చిన 94 ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి పరిశీలించారు. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇద్దరు ఇంజనీర్ల పర్యవేక్షణలో పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సజావుగా ఎఫ్.ఎల్.సి కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భద్రతా చర్యలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, డీపీవో ప్రభాకర్ రావు, వైసిపి ప్రతినిధి శ్రీనివాసులు, టిడిపి చెరకుతోట పవన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఎంఎండి.ఇమామ్, బీఎస్పీ అంజయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ మసూద్ వలి, బిజెపి ఈశ్వర్ ప్రసాద్, సీపీఎం ప్రతినిధి బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల పక్రియ : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

సాధారణ ఎన్నికలు-2024 కోసం ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ (మానిటరింగ్) పకడ్బందీగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎం.గౌతమి మాట్లాడుతూ జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎన్‌జిఆర్ఎస్, ఎన్‌జిఎస్‌పి, సీవిజిల్, కంప్లైంట్ రిసెప్షన్ యూనిట్, 1950 కాల్ సెంటర్, ఫీల్డ్ మానిటరింగ్ యూనిట్ ఎంసిసి, ఎక్స్పెండిచర్ మానిటరింగ్, పర్మిషన్ ఎన్ఫోర్స్మెంట్, కమర్షియల్ టాక్సెస్-రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, స్టాట్యూటరీ రిపోర్ట్ సెల్, ఐ.అండ్.పీఆర్, తదితర అంశాలకు సంబంధించి 22 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడి నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ మానిటరింగ్ ఎప్పటికప్పుడు చేయాలని, ఇందులో వెబ్ క్యాస్టింగ్, వీ.ఎస్.టీ, ఎస్.ఎస్.టీ టీమ్‌లు కూడా కవర్ చేయాలన్నారు. వాహనాల అనుమతికి సంబంధించిన రిపోర్టులు అందించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారుల దగ్గర నుంచి రిపోర్టులను సకాలంలో తెప్పించుకోవాలన్నారు. నోడల్ అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. సోషల్ మీడియా నుంచి వస్తున్న అడ్వర్స్ న్యూస్‌కి సంబంధించిన రిపోర్టులు కూడా అందజేయాలన్నారు. ఎం.సి.ఎం.సి సెల్ నుంచి 24 గంటల పాటు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, నోడల్ అధికారులు వరప్రసాద్, ఉమామహేశ్వరమ్మ, వీర్రాజు, ప్రభాకర్ రెడ్డి, భాస్కర్, శ్రీనివాస నాయక్, అప్పాజీ, ఎంసిఎంసి మెంబర్ సెక్రటరీ పి.గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కూటమి'కి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం

ప్రజాశక్తి-అనంతపురం



హోటల్ నిర్వాహకుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

కూటమి కట్టిన మూడు పార్టీలకూ గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని 20వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందజేస్తున్న ప్రభుత్వ పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఉమ్మడిగా చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభ అట్టర్ ఫ్లాఫ్ అయిందన్నారు. రాష్ట్రానికి ఏం చేయబోతున్నారో చెప్పకుండా మోదీ, పవన్, చంద్రబాబు ఒకరికి ఒకరు పొంతన లేకుండా మాట్లాడారన్నారు. ప్రధాని అభ్యర్థిగా 2014లో తిరుపతి సభలో మోదీ ఇచ్చిన హామీల ప్రస్తావన ఏదీ అన్నారు. ముఖ్యంగా ప్రత్యేక హోదా, పోలవరం గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. 2014లో కలిసిన మూడు పార్టీలు 2019 వచ్చే సరికి విడిపోయాయన్నారు. ఆనాడు ఎందుకు విడిపోయారు? నేడు ఎందుకు కలుసుకున్నారు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. మరోసారి మూడు పార్టీలకు గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థలు చేస్తున్న దోపిడిని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం గణేనాయక్ భవన్‌లో అనంతరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్పొరేట్ విద్యా సంస్థలు దోపిడీకి వ్యతిరేకంగా రూపొందించిన కరపత్రాల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు దోపిడీ ప్రారంభించాయని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం ముందస్తు అడ్మిషన్లు ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలు జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ ఏమాత్రం స్పందించడం లేదన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పాటించకుండా ఇష్టా రాజ్యంగా విద్యార్థులను కళాశాలలో జాయినింగ్ చేసుకొని విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు మార్కుల కోసం ర్యాంకుల కోసం లక్ష్యంగా మానసికంగా నైతికంగా వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఆ కళాశాలలో మంచి నీరు, టాయిలెట్ సదుపాయాలు కరువైపోయాయని తెలిపారు. మౌలిక వసతులు ఏమాత్రం కూడా ఉండవన్నారు. చాలా మంది విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దష్టిలో ఉంచుకొని కార్పొరేట్ విద్యాసంస్థలు వద్దు ప్రభుత్వ విద్య ముద్దు విద్యార్థులు తల్లిదండ్రులు భవిష్యత్తు ఆలోచన చేయాలని కోరారు. విద్యా శాఖ అధికారులు స్పందించి అనుమతులు లేకుండా విద్యార్థులను ఇబ్బందులు గురి చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, జిల్లా అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు వైటిసి రమేష్, సిద్దు, వంశీ, జిల్లా సహాయ కార్యదర్శులు గిరి, వెంకీ, చందు, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఎంఎస్ సొల్యూషన్స్‌పై చర్యలు తీసుకోవాలి

అనంతపురం కలెక్టరేట్ : నిరుద్యోగ యువతీ యువకులే లక్ష్యంగా చేసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిన గుత్తిలోని ఎంఎస్ సొల్యూషన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.బాలక్రిష్ణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమైన జాబ్ కన్సల్టెన్సీల మోసాలు, ఇప్పుడు మండల కేంద్రాలకు పాకాయన్నారు. వాటి వల్ల నిరుద్యోగులు మోసపోతున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే గుత్తిలో కూడా ఎంఎస్ సొల్యూషన్స్ వారు మోసం చేశారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

పక్కాగా ఓటరు జాబితా : ఆర్‌డిఒ

గుత్తి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తప్పుల్లేని ఓటరు జాబితాను తయారు చేయాలని గుంతకల్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికారులతో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కొత్తగా ఓటరుగా నమోదుకు ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 15 వరకూ అవకాశం కల్పించిందన్నారు. ఓటరు జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు అందినా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని రాజకీయ పార్టీలు కోడ్ ఉల్లంఘించకుండా నిఘా ఉంచాలన్నారు. రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగు వేసి, పోస్టర్లు ఉంటే తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.భారతి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి డి.శివాజీరెడ్డి, ఉప తహశీల్దార్ లలిత, ఆర్ఐ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి

అనంతపురం క్రైం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని కాలనీల్లో పోలీసులు గ్రామసభలు ఏర్పాలు చేసి అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా అందరు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ప్రయాణమే 'పరీక్ష'

ప్రమాదకరంగా విద్యార్థుల ప్రయాణాలు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఆటోలు, ప్రయివేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణించడం ప్రమాదకరం. అయితేనేం చేసేది లేదు. ఎందుకంటే పదో తరగతి పరీక్షలు. కచ్చితంగా సమయానికి వెళ్లాల్సిందే.. పరీక్షలు రాయాల్సిందే.. ఆర్టీసీ బస్సులను నమ్ముకుంటే సమయానికి లేవు..రావు.. బస్సుల సమయం వరకూ ఆగితే పరీక్ష తప్పాల్సిందే.. చేసేదిలేక.. ప్రమాదమని తెలిసినా తప్పనిసరిగా ఆటోలు, ప్రయివేటు వాహనాల్లో విద్యార్థులు ప్రయాణించాల్సి వస్తోంది....



ఆటోలో వెనుక కూర్చొని వెళ్తున్న విద్యార్థినులు

జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగానే మండల కేంద్రంలోని మౌర్య, జెడ్పీ హౌస్కూళ్లలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో సుమారు 600పైన విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. ఈ కేంద్రాలకు మండల పరిధిలోని పెద్దయక్కలూరు, చీమలవాగుపల్లి, జూటూరు, అమ్మలదిన్నె తదితర గ్రామాల నుంచి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాల్సి ఉంది. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి బస్సు సౌకర్యాలు సరిగా లేవు. బస్సుల కోసం ఎదురుచూస్తే పరీక్షకు సమయం మించిపోతుంది. చేసేంది లేక చాలామంది విద్యార్థులు, ఆటోలు, ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆటోవాళాలు కూడా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. ఇలా ప్రయాణిస్తూ గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలూ ఉన్నాయి. అయినా తప్పని పరిస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని ఆయాగ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

చిరుత మృతి



మృతిచెందిన చిరుత

కళ్యాణదుర్గం : శెట్టూరు మండలం ఐదుకల్లు అటవీ ప్రాంతంలో ఓ చిరుత మృతి చెందింది. సోమవారం గుర్తించిన గొర్రెల కాపర్లు అడవీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ నాగేనాయక్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతిచెందిన చిరుతను పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత నీటి కొరత కారణంగా మృతిచెందిందా.. లేక అనారోగ్యం కారణంతో మృతి చెందిందా.. అని పోస్టుమార్టం రిపోర్టులో తేలుతుందన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన

కళ్యాణదుర్గం : తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. కందుకూరు మండలం గండేపల్లి గ్రామంలో తీవ్రమైన తాగునీటి సమస్య నెలకొందని స్థానిక మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో గంటపాటు రాకపోకలు స్తంభించాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కేంద్ర సాయుధ బలగాల కవాతు

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ డీఎస్పీ బివి శివారెడ్డి పర్యవేక్షణలో గార్లదిన్నె పోలీసుస్టేషన్ పరిధిలోని కోటంక, మర్తాడు, గార్లదిన్నె, కల్లూరు గ్రామాల్లో సోమవారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఇటుకలపల్లి సి.ఐ శ్రీధర్, బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ధర్మేంద్రసింగ్, ఎస్ఐ గౌస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన కాలనీల్లో కవాతు సాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కవాతు నిర్వహిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

బ్యాంకు ఖాతాలో డబ్బు మాయం

గార్లదిన్నె: తనకు తెలియకుండా అకౌంట్ నుంచి డబ్బును యాయం చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పెనకచర్ల డ్యాం గ్రామానికి చెందిన షేక్ జిలాన్‌బాషాకు అనంతపురం సప్తగిరి సర్కిల్ నందు గల యాక్సిస్ బ్యాంకులో అకౌంట్ ఉంది. అయితే శనివారం రాత్రి ఖాతా నుంచి రూ.1,73,100 సైబర్ క్రైమ్ ద్వారా దొంగలించినట్లు బాధితుడు వాపోయాడు. దీనిపై సైబర్ క్రైమ్ నెంబర్ 1030తోపాటు గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ లింకు పంపించి దానిద్వారా ఫోను హ్యాక్ చేసి అమౌంట్‌ను ఖాతా నుంచి ట్రాన్స్‌ఫర్ చేసినట్లు బాధితుడు తెలిఆపరు. దీనిపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. ఇందులో భాగంగా అనంతపురంలోని 1వరోడ్డులో శారదా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఎం.గౌతమి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా 12 పాఠశాలలకు చెందిన 672 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదర్శ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షలకు 365 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 22 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ శ్రీదేవి తెలిపారు. వీరిలో నలుగురు రెగ్యులర్ విద్యార్థులు, 18 మంది సప్లిమెంటరీ రాసే విద్యార్థులు అన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 643 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 46 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒలు నరసింహారెడ్డి, రామాంజనేయులు తెలిపారు.

బొమ్మనహాల్ : మండలంలోని నాలుగు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. ఆయా సెంటర్లలో 1,056 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 959 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి మల్లికార్జున్ తెలిపారు.

పామిడి : మండల వ్యాప్తంగా 12 పాఠశాలల్లో ప్రశాంతంగా పదో తరగతి పరీక్ష ప్రారంభమైనట్లు మండల విద్యాధికారులు జయానాయక్, సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీ సరస్వతి విద్యా మందిరం, ఎస్‌ఎఫ్‌ఎస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, గవర్నమెంట్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ దశ రాజు తెలిపారు.


పామిడిలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

రాయదుర్గం : పదో తరగతి పరీక్షలు సోమవారం రాయదుర్గంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల కోసం పట్టణంలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయగా 1507 మంది విద్యార్థులు హాజరయ్యారు. 135 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారిణి ఎన్.నాగమణి తెలిపారు.

ఎద్దవడుగూరు : మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా 60 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి రాముడు తెలిపారు. ఆయా కేంద్రాలను ఆయనతోపాటు తహసీల్దారు శేషరాంసింగ్, ఎస్సై ముత్యాల శ్రీనివాసులు పర్యవేక్షించారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువరైతు మృతి

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన పులకుర్తి ఉపేంద్ర (29) పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉపేంద్ర గ్రామంలోని తన పొలంలో ఏర్పాటు చేసుకున్న నూతన బోరుకు విద్యుత్ సర్వీస్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుండగా పైన వెళ్లిన మరో ఎల్‌టిలైన్ వైరుకు తగిలింది. దీంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానిక ఆర్‌ఎంపి డాక్టర్ వద్దకు తీసుకురాగా పరిస్థితి విషమంగా ఉండటంతో బళ్లారికి తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే ప్రయివేటు వాహనంలో బళ్లారికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కాగా బాధిత కుటుంబాన్ని ఉప సర్పంచి తనయుడు తిప్పేస్వామి, సర్పంచి భర్త వన్నూరుస్వామి, వైసిపి నాయకులు లోకేష్ తదితరులు పరామర్శించారు.

గుత్తిలో చోరీల జోరు

గుత్తి : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న దుకాణాల్లోకి ఆదివారం రాత్రి దొంగలు చొరబడ్డారు. ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న న్యాయవాది ఇస్మాయిల్ కార్యాలయ షట్టర్ తాళాలను దుండగులు పగలగొట్టిలోనికి ప్రవేశించారు. అందులోని ఫైల్స్, పుస్తకాలు చెల్లాచెదురు చేశారు. రూ.2వేలు నగదును దోచుకెళ్లారు. తాడిపత్రి రోడ్డు లోని భాష ఫోటో స్టూడియోలోకి దుండగులు చొరబడి అక్కడ వున్న రూ.5వేలు నగదును ఎత్తుకెళ్లారు. జిరాక్స్ సెంటర్‌లోకి వెళ్లి ల్యాప్‌టాప్‌ను అపహరించుకెళ్లారు. అలాగే ముత్తూట్ ఫిన్ కార్ప్, కళ్యాణ్ జ్యువెలరీ కార్యాలయం, ఎలక్ట్రానిక్స్ దుకాణాల్లో చోరీయత్నం చేశారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంక్షేమ పథకాలే గెలుపు అస్త్రాలు

ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-పుట్లూరు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో గెలుపు అస్త్రాలని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని ఏ.కొండాపురం, అరకటవేముల, సూరేపల్లి, కడవకల్లు, సంజీవపురం, ఓబుళాపురం, దోసలేడు, చెర్లోపల్లి, నారాయణరెడ్డిపల్లి, చాలవేముల, మడ్డిపల్లి, కుమ్మనమల, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, రంగరాజుకుంట, మడుగుపల్లి, జంగంరెడ్డిపేట, ఎల్లుట్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో తమకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు పేదలు, పెత్తందారులకు మధ్య జరుతున్నాయన్నారు. ఈ యుద్ధంలో వైసిపి ఓటు వేసి పేదలే గెలవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఎన్నికల్లో అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తూ అడ్డదారిలో అధికారంలోకి రావాలని కుటిల యత్నాలు చేస్తున్న చంద్రబాబు ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. రాజకీయాల్లో 45 ఏళ్లు అని చెప్పుకునే చంద్రబాబుకు జగన్ అంటే భయం చుట్టుకుందన్నారు. అందుకే గుంపుతో వస్తున్నారని ఎద్దేవా చేశారు. కావున ఐదేళ్లలో మీ కుటుంబంలో జరిగిన మంచిని చూసి వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

శింగనమల : రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే సిఎం జగనన్నతోనే సాధ్యమవుతుందని సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రామస్వామి ఆలయంలో ఇటీవల నూతనంగా ఎంపికైన వైసిపి మండల కన్వీనర్ చిక్కాల బాలకృష్ణ, మండల యూత్ కన్వీనర్ బెస్త ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, వైసిపి మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి లలితకళ్యాణి, వైసిపి ఎస్సీ సెఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ, మండల జెసిఎస్ కన్వీనర్ వెంకటరమణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఓబుళపతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ వైసిపి అభ్యర్థులు వీరాంజనేయులు, శంకరనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, నాయకులు నాగవర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, జూలాకాలువ డీలర్ సూర్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జగన్, శివశంకర్‌రెడ్డి, సర్పంచి వెంకటప్ప, నాగులగుడ్డం డీలర్ ఆదినారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

రాయదుర్గం : వార్డు వాలంటీర్లుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే శాఖాపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్, పట్టణ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.కిషోర్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వార్డు వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే తప్ప ఎన్నికలు ముగిసే వరకూ ప్రజల వద్దకు కూడా వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రాజకీయ పార్టీ నాయకుల వెంట తిరగరాదు. తమ పరిధిలో ఎక్కడైనా పార్టీలకు సంబంధించిన గుర్తులు పోస్టర్లు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉంటే సమాచారం అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాలంటీర్లపై కేసులు నమోదు చేయడం, విధుల నుండి తొలగించడం మొదలైన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

అనంతపురం : నగరంలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో భాగంగా బెంగళూరు నుంచి అలెసెక్ టెక్నాలజీస్ మల్టీ నేషనల్ కంపెనీ ప్రతినిధులను ఇంటర్వ్యూలు నిర్వహించగా 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గ్రామ నేపథ్యం కలిగిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషకరమని ప్రిన్సిపల్ ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఆదినారాయణ, వరలక్ష్మి, మేడం నౌషాద్, సుబ్బన్న, పనూక్, వలి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హనుమంతరెడ్డి



ఉరవకొండ : వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుమ్మతి హనుమంతురెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శనివారం వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి స్థాపించినప్పటి నుంచి పార్టీ కోసం పని చేశానన్నారు. తన సేవలను గుర్తించి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం సంతోషకరమన్నారు. తనకు అవకాశం కల్పించిన సిఎం జగన్, సహకరించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైసిపి రాయలసీమ జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'కూటమిదే విజయం'

పామిడి : రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని టిడిపి అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమ తీసుకురాలేకపోయారన్నారు. పూటపూటకు అప్పులు తెచ్చి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించడం, భవిష్యత్తు తరాలపై అప్పులు మోపడమేనన్నారు. చదుకున్న నిరుద్యోగులు రాష్ట్రం వదిలిపోతున్నారన్నారు. ఉపాధి లేక పల్లె ప్రజలు వలస బాట పట్టారని విమర్శించారు. మరోవైపు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, పక్కరాష్ట్రాల కంటే ఎక్కువగా డీజిల్ పెట్రోల్ ధరలు, ఎన్నోదఫాలుగా పెరిగిన కరెంటు బిల్లులతో పేదల బతుకులు అతలాకుతలం అయ్యాయన్నారు. విసుగెత్తిన అన్నివర్గాల ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలని నిర్ణయించుకున్నారన్నారు. ఇందుకు ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభకు భారీగా ప్రజలు తరలిరావడమే ఇందుకు నిదర్శనమన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

బెలుగుప్ప : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విజయసింహ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటే మన రాష్ట్రం అభివృద్ధి సాధ్యమన్నారు. అంతేగాకుండా యువతకు ఉద్యోగాలు రావాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గుత్తి : బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఉద్యోగి రామకృష్ణ తల్లి సరస్వతి జ్ఞాపకార్థం సోమవారం మండలంలోని బాచుపల్లిలో ఉన్న జంగాలకాలనీలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 50 మంది గర్భిణులకు రూ.10వేలు విలువజేసే మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, బేతాపల్లి పిహెచ్‌సి సిహెచ్‌ఒ రమణమ్మ, సూపర్‌వైజర్ రెడ్డమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, శివప్రసాద్, ఏఎన్‌ఎం సునీత, ఆశా కార్యకర్త రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలో సూర్య సేవాసమితి ఆధ్వర్యంలో రాణీ సత్రంలోని ప్రయివేటు బస్టాండ్ వద్ద సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి సూర్య సేవా సమితి ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు సమితి అధ్యక్షుడు సి.మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తాయి శేఖర్, వెంకటేశులు, తిప్పేస్వామి, షబ్బీర్, సురేష్, శేఖర్, లక్ష్మీరెడ్డి, నిషార్, భాస్కర్‌రెడ్డి, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వడ్డిపల్లిలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని వడ్డుపల్లిలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొందని సిపిఎం నాయకులు ఎం.రామయ్య తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో సమస్య తీవ్రంగా ఉందన్నారు. చేసేదిలేక స్థానికులు వ్యవసాయ బోర్ల వద్దకు కిలోమీటర్లు నడిచి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు లక్ష్మీదేవి, ముత్యాలమ్మ, సరస్వతి, సుస్మిత, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.


నీటి కోసం తిప్పలు పడుతున్న మహిళలు

వైసిపికి ఓటుతో బుద్ధి చెప్పాలి

బుక్కరాయసముద్రం : అరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని తుంగలో తొక్కాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని జంతులూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రావణిశ్రీ మాట్లాడుతూ మహిళలకు వైసీపీ ప్రభుత్వ పాలనలో భద్రత లేదన్నారు. ప్రశ్నించిన మహిళలపై దౌర్జన్యాలు, హత్యలు జరిగాయన్నారు. ఈనేపథ్యంలో ప్రజలందరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబు ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దిసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రామనేపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

అనంతపురం : వారంరోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సోమవారం రాప్తాడు మండలం రామనేపల్లిలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు జెఎన్‌టియు ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియు కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 50 మంది వాలంటీర్లు వారం రోజుల పాటు శిబిరంలో పాల్గొని వివిధ రకాలు సేవలు చేయనున్నట్లు తెలిపారు.ముఖ్యంగా స్థానిక అవసరాలను తీర్చడం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యంతో వివిధ కమ్యూనిటీ సేవా ప్రాజెక్టుల్లో నిమగ్నమై ఉంటారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సేవామార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.మమత ఆధ్వర్యంలో జరిగినది ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రావణిశ్రీని కలిసిన దండు శ్రీనివాసులు

శింగనమల : నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని అనంతపురంలోని స్వగృహంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్న చిన్న సమస్యలు ఉన్నా సర్దుకుని కలిసికట్టుగా పని చేసి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర్‌యాదవ్, దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండి పరుశురాం, అనంతనేని చౌదరి, నాగేశ్వరరెడ్డి, బెస్త నారాయణస్వామి, బెస్త అమర్, దేరంగుల శంకరయ్య, మహమ్మద్‌గౌస్, ప్రసాద్‌నాయక్, జంఘంశెట్టి నవీన్, దండు ప్రకాష్, సూరి, సతీష్ రాయల్, రాజారాబు, కుమార్, నరసింహానాయక్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఉరవకొండ : విద్యుదాఘాతంతో కొట్టం దగ్ధమైన విడపనకల్ మండలం గాజుల మల్లాపురానికి చెందిన హరిజన లింగన్నకు ఎంపిపి కరణం పుష్పావతి, సీనియర్ నాయకులు కరణం భీమ్‌రెడ్డి రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. విషయాన్ని ఫోన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డికి తెలయజేశారు. త్వరలోనే కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని విశ్వేశ్వరరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు డిష్ వెంకటేష్, షణ్ముఖగౌడ్, దాసరి వెంకటేష్, హంపయ్య, ఉమాశంకర్, రాజశేఖర్, కావలి వెంకటేష్, వన్నారెడ్డి, శంకర్‌గౌడ్, సామాజిక కార్యకర్త పాల్తూరు ఆనంద్‌రాజ్, తదితరులు ఉన్నారు.

జనసేనలో 20కుటుంబాలు చేరిక

ఉరవకొండ : మండల పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు సోమవారం జనసేనలో చేరాయి. ఈ సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి క్రమశిక్షణతో పవన్‌కళ్యాణ్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రిస్వామి, మారుతి, నందు, అక్కులప్ప, భారత్, లోకేష్, అశోక్, బ్రహయ్య, నాయకులు మనికుమార్, వంశీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పెద్దపప్పూరు : మండల పరిధిలోని కొట్టాలపల్లి, పసులూరు, కుమ్మేత, నర్సాపురం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సిఐ రోషన్, ఎస్ఐ శరత్‌చంద్ర సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులను తనిఖీ చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

నార్పలలో పౌష్టికాహార పక్షోత్సవాలు

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తహశీల్దార్ నారాయణస్వామి, ఎంపిడిఒ రాముడు, సిడిపిఒ భారతి మాట్లాడుతూ తల్లిపిల్లల సంరక్షణే ఐసిడిఎస్ లక్ష్యమన్నారు. అదేవిధంగా ప్రీస్కూల్ బలోపేతం చేయడం, పిల్లలు, తల్లిదండ్రుల కోసం ఆట ఆధారిత ప్రదర్శన కార్యకలాపాలు తల్లిదండ్రులు పిల్లలతో కలిసి బొమ్మల తయారీ సెషన్లను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని, అంగన్వాడీలు శ్రీదేవి, రామాంజనమ్మ, రేణుక, కళావతి, సుజాత, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

గుత్తి : వేసవికాలం సందర్భంగా పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం సోమవారం గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. గుత్తిలోని 8 పరీక్ష కేంద్రాలు, గుంతకల్లులోని 12 పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మజ్జిగను అందజేశారు. ప్రతి ఏటా వేసవిలో కార్యక్రమాన్ని కొనసాగిస్తామని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ అన్నారు.

స్టోర్‌డీలర్లపై ఫిర్యాదు

రాయదుర్గం : పట్టణంలో చౌక దుకాణపు డీలర్లుగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు తహశీల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చౌక దుకాణపు డీలర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం చట్టవిరుద్ధమన్నారు. పట్టణంలో నలుగురు డీలర్లు వైసిపి అభ్యర్థి వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మున్సిపల్ వార్డు మాజీ సభ్యులు తిప్పేస్వామి, సిద్ధన్న, బీసీ సెల్ నాయకుడు పూజారి తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కళ్యాణదుర్గం : ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నందున అధికారులు తప్పనిసరి నిబంధనలు పాటించాలని రిటర్నింగ్ అధికారి రాణీసుష్మ సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన టీమ్ అధికారులు మండలాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. అనధికారిక సమావేశాలు పాఠశాలలు ఆలయాల్లో ప్రచారాలు కులమతాలను రెచ్చగొట్టే విధంగా రాజకీయ పార్టీల ప్రచారాలను అడ్డుకోవాలన్నారు. డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేకంగా ఉంచాలన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

ఉరవకొండ : ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారిణి పావని సూచించారు. సోమవారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఇంద్రావతి అంగన్వాడీ కేంద్రంలో వడదెబ్బపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల బయట వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రజలు ఉదయం పది నుంచి సాయంత్రం వరకూ వీలైతే ఎండలో తిరగకూడదన్నారు. తీవ్రమైన తలనొప్పి, జ్వరం, మగతగా ఉండడం, అధికంగా దాహం వేయడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. మద్యపానం, ధూమపానం మసాలా తిండి మానాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండి షఫీ, సిఓ భగవన్ దాస్, సిహెచ్‌ఒలు హిమబిందు, భవానీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్త సుజాత, 104 సిబ్బంది సురేష్, హొన్నూర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74 ఉడేగోళం మద్దేనేశ్వరస్వామి జాతర సందర్భంగా కాంట్రాక్టర్ ఆర్.టి.కాంతారెడ్డి మిత్రబృందం ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు.